


సూర్యుడినే సవాలు చేస్తూ..

తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం గాలిపటం ఎగరేస్తున్న బాలుడు

ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ జమ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 18: ప్రభుత్వ గృహాల లబ్ధిదారులకు వడ్డీ జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20,301మంది లబ్ధిదారులు రూ.35వేల చొప్పున బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,57,30,508జమ చేసినట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. జిల్లా హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసరావు, మెప్మా పీడీ రాధమ్మ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల దడ

కేంద్ర ఎన్నికల సంఘం కొరడా చేతికి తీసుకోవడంతో జిల్లా అధికార యంత్రాంగం వణికిపోతోంది. అధికారంలో ఉన్న నేతల మాటలకు తలొగ్గి చేసిన పనులు వెంటాడతాయని గిరీషా సస్పెన్షన్ పాఠం చెబుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర ఏళ్లుగా అధికార యంత్రాంగం, పోలీసులు పూర్తిగా స్వతంత్రతను కోల్పోయి వ్యవహరించారు. వైసీపీ నాయకులు చెప్పిందల్లా చేశారు. కేసులు పెట్టారు. అరెస్టులు చేశారు. అధికారంలో ఉన్నవారు తమను కాపాడతారనే నమ్మకంతోనే ఇందుకు తెగించారు. అయితే నేతలు చేసిన పాపం, తమకు శాపంగా మారుతోందని ఇప్పుడు భయపడుతున్నారు. మూడు నెలల్లో జరగనున్న ఎన్నికలను తలచుకుని గడగడ వణికిపోతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఇంతకాలం జరిగిందేమిటంటే...

జిల్లాలో 2020 నుంచీ 2021 దాకా స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరిగాయి. ఆ ఎన్నికలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో జరుగుతాయి. రాష్ట్ర ఎన్నికల అధికారి వున్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం తరహా అధికారం, నియంత్రణ వారికి వుండవు. దీంతో అధికార పార్టీ నేతలు చెప్పినట్టల్లా జిల్లా అధికారులు తలాడించారు. వారు చెప్పినట్టు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు పని చేశారు. దీంతో అధికార పార్టీ నేతలు రెచ్చిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రత్యర్థి పార్టీల నుంచీ అసలు పోటీ లేకుండా చేసుకోవడానికి నామినేషన్లు వేయనీయకుండా అడ్డుపడడం, దాఖలు చేసినా వారి పేరిట ఫోర్జరీ సంతకాలు చేసి నామినేషన్లు ఉపసంహరించడం, వీలు కానిచోట్ల కారణాలు కూడా చూపకుండానే అధికారులతో వాటిని తిరస్కరింపజేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు.ఆ క్రమంలో దౌర్జన్యాలు, దాడులూ అనేకం జరిగాయి.ఎన్నికల్లో సహకరించిన అధికారులు, ఉద్యోగులపై చర్యలు లేకపోవడంతో అధికార,ఉద్యోగ వర్గాల్లో భయం అన్నది లేకుండా పోయింది. ఓ దశలో రాష్ట్ర ఎన్నికల అధికారి అప్పటి ఉమ్మడి చిత్తూరు కలెక్టర్ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ రమేష్‌రెడ్డి, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు పోలీసు అధికారులను బదిలీ చేసినా అమలు కాలేదు. అది చూసి అధికారులు, ఉద్యోగుల్లో ఏ మూలో వున్న భయం కూడా పోయింది.

ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు

ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గతేడాది నుంచీ ఓటర్ల జాబితా సవరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల అనుభవంతో సార్వత్రిక ఎన్నికల ఓటర్ల జాబితా తయారీలో కూడా అధికారులు, ఉద్యోగులు వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. మృతులు, వలస వెళ్ళిన వారి ఓట్లు తొలగించకపోవడం, ఇతర ప్రాంతాల వారి పేర్లు జాబితాలో నమోదు చేయడం, జీరో డోర్ నెంబర్ల పేరిట పెద్దసంఖ్యలో ఓటర్లు కొనసాగుతుండడం, ఒకే డోర్ నెంబరులో పదిమంది కంటే మించి ఓటర్లు వుండడం వంటివి సంభవించాయి. టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు కోసం వైసీపీ నేతలు కొత్త తరహా దందాకు పాల్పడ్డారు. వారి పేర్ల తొలగింపుకు వారి పేరిటే బోగస్ దరఖాస్తులు చేయించారు. టీడీపీ బీఎల్‌ఏలు అందజేసిన అభ్యంతరాలను పరిశీలించడం గానీ, వాటిపై చర్యలు తీసుకోవడం గానీ జరగలేదు. జిల్లాస్థాయి నుంచీ బూత్ స్థాయి వరకూ అధికారులు, ఉద్యోగులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళతో వారు చెప్పినట్టల్లా చేశారు. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర నియోజకవర్గాల్లో ఇవి పెద్దఎత్తున జరిగాయి.

దేవుడా..దేవుడా..!

ఓటర్ల జాబితా తయారీలో తప్పిదాలపై టీడీపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. ప్రాథమిక పరిశీలనలో అవకతవకలు జరిగాయని గుర్తించిన ఈసీ లోతుగా పర్యవేక్షిస్తోంది. గత రెండు సమీక్షల్లో జిల్లా అధికారులకు హెచ్చరికలు చేసింది. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతి సెగ్మెంట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. చంద్రగిరికి సంబంధించి అందిన క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించలేదని గుర్తించి తిరుపతి రూరల్ మండలంలో 24మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఆ క్రమంలోనే 2021 మార్చి, ఏప్రిల్‌లో జరిగిన తిరుపతి ఉప ఎన్నికల నాటి తప్పిదాలను తవ్వి తీసింది. వాటికి బాధ్యులైన వారిపై చర్యలకు దిగింది. ఏకంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేసింది. ఈ పరిణామంతో అధికార, ఉద్యోగ వర్గాల్లో అలజడి రేగింది. ఐఏఎస్ అధికారిపైనే చర్యలు తీసుకున్నపుడు తమ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వారిలో తలెత్తుతోంది. ఇదివరకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏమి చేసినా అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో జరుగుతాయి కనుక తమకు ఇబ్బంది కలగలేదని, అదే ఇపుడు కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో వున్నందున ఈసీ చర్యలు తీసుకుంటే తమను కాపాడేదెవరన్న భయం వారిని వెంటాడుతోంది. ముఖ్యంగా అధికార పార్టీ నేతలకు సహకరించిన పలువురు బీఎల్వోలు, వీఆర్వోలు, డీటీలు, తహసీల్దార్లు ఇపుడు ఆందోళన చెందుతున్నారు. తుది ఓటర్ల జాబితా విడుదలయ్యాక అందులో తప్పిదాలను గుర్తిస్తే మాత్రం దానికి బాధ్యులైన వారు ఈసీ చర్యలకు గురికాక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళు ఓవైపు, ఈసీ భయం మరోవైపు వెన్నాడుతుండడంతో జిల్లాలో అధికార యంత్రాంగం పరిస్థితి అడకత్తెరలో చిక్కుకున్న చందంగా మారుతోంది. పోలీసు అధికారులు అయితే బరితెగించి మరీ చాలా చోట్ల ప్రవర్తించారు. వీరంతా కూడా ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది.

● ఐఏఎస్ అధికారి సస్పెన్షన్‌తో వణికిపోతున్న అధికార యంత్రాంగం ● పాపం నేతలది.. శాపం అధికారులకా అని ఆందోళన

టీడీపీ సభకు భారీ ఏర్పాట్లు



చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి/తిరుపతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో రా కదలిరా... పేరిట శుక్రవారం టీడీపీ నిర్వహిస్తున్న భారీ బహిరంగసభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.ఆయనకు స్వాగతం పలుకుతూ విశ్వోదయ క్రీడా ప్రాంగణం నుంచి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరే చంద్రబాబు 10.30 గంటలకు వెంకటగిరి బస్టాండు ఎదురుగా వున్న విశ్వోదయా గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచీ రోడ్డు మార్గాన 10.45 గంటలకు ఎస్‌ఆర్‌ఎల్ కన్వెన్షన్ పక్కన ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు. సభలో మధ్యాహ్నం 12.15 గంటల వరకూ పాల్గొంటారు.కాగా వెంకటగిరి సభకు 1.20 లక్షల మంది జనాన్ని సమీకరించాలని పార్టీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈనెల 9వ తేదీననే వెంకటగిరిలో చంద్రబాబు సభ నిర్వహించాల్సి వుండగా కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అదే తేదీన విజయవాడకు రావడంతో వాయిదా పడింది.హఠాత్తుగా పర్యటన వాయిదా పడడంతో టీడీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అయితే ఎక్కువ వ్యవధి తీసుకోకుండా అధినేత పర్యటన పది రోజుల్లోనే ఖరారుకావడంతో రెట్టించిన ఉత్సాహంతో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ,టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపి గంగాప్రసాద్, పెంచలకోన దేవస్థాన మాజీ చైర్మన్ తానంకి నానాజీ తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నేతలు తిరిగి ఏర్పాట్లకు దిగారు. ఇతర జిల్లాలకు దీటుగా వెంకటగిరి సభకు జనసమీకరణ జరపాలని జిల్లా పార్టీ నేతలు నిర్ణయించారు. అందులో భాగంగా తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచీ భారీగా జనాన్ని సమీకరించాలని నిశ్చయించారు. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ గరిష్టంగా 40 వేల నుంచీ 50 వేలమందిని సభకు తరలించాలని, మిగిలిన సెగ్మెంట్ల నుంచీ 15 వేలమంది చొప్పున తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు.రెండు మూడు రోజులుగా నేతలు ఆ పనిలో బిజీగా వున్నారు.ఎన్నికల వేళ పార్టీ ప్రతిష్ఠతో పాటు పార్టీలోనూ, స్థానికంగానూ తమ ఉనికి, గుర్తింపుల కోసం నాయకులు కూడా వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల వారీగా వాహనాలు సమకూర్చి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులను తరలించే పనిలో పడ్డారు.కాగా చంద్రబాబు సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులు, ప్రజలు శుక్రవారం ఉదయం 9 గంటలకే వెంకటగిరి పట్టణం చేరుకోవాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.

సంజీవయ్యకు టిక్కెట్ ఇస్తే సహకరించం

● వైసీపీ అధిష్ఠానానికి అసమ్మతివర్గం స్పష్టీకరణ ● ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా మళ్లీ ఆత్మీయ సమావేశం



నిన్ను నమ్మం సంజీవయ్య అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వైసీపీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ముఖ్య నాయకులు

దొరవారిసత్రం, జనవరి 18 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వచ్చే ఎన్నికల్లోనూ టికెట్ ఇస్తే సహకరించబోమని సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతివర్గం నాయకులు ప్రకటించారు. గురువారం ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా అసమ్మతి వర్గం మరోసారి దొరవారిసత్రం మండలం వెదురుపట్టు సమీపంలోని కళత్తూరు రామమోహన్‌రెడ్డి మామిడితోటలో సమావేశమైంది. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి సుమారు 1000 మంది వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. 'జగన్ ముద్దు ... సంజీవయ్య వద్దు' అంటూ నినాదాలు చేశారు. అలాగే 'నిన్ను నమ్మం సంజీవయ్య' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

హాజరైన వైసీపీ నాయకులు వీరు

కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ పార్టీ కన్వీనర్ కళత్తూరు శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాండురంగయాదవ్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నగరి నియోజవర్గ పరిశీలకుడిగా ఉన్న పెళ్ళకూరు మండల నాయకుడు చిందేపల్లి మధురెడ్డి హాజరైన వారిలో ముఖ్యులు. వీరితో పాటు కట్టా కమలాకర్‌రెడ్డి, కళత్తూరు జనార్దన రెడ్డి, ఓడూరు రమణారెడ్డి, పార్థసారథిరెడ్డి, రాజసులోచనమ్మ, తిరుపాల్, ముప్పాళ్ళ చంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, ఇలుపూరు సుధాకర్, రామచంద్రయ్య, సూళ్లూరుపేట జడ్పీటీసీ సుప్రియ వంటి ముఖ్యనాయకులతో పాటు, ఎమ్మెల్యే స్వంత మండలం తడ నుంచి గండవరం సురేష్‌రెడ్డి, శేఖర్, చంద్ర, పరమశివం, పూడి శివ, మురగన్ తదితరులు హాజరైనవారిలో ఉన్నారు. పదిమంది సర్పంచ్‌లు, ఐదుగురు ఎంపీటీసీలు, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, ఓజిలి మండలాల నుంచి ప్రధానంగా సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సమావేశానికి వచ్చారు.

ఆయనొక్కడికే ఎందుకు?

జగన్ పాలనలో ఎమ్మెల్యే సంజీవయ్య రూ.వందల కోట్ల ప్రజాధనం లూటీ చేశారని వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్టా సుధాకరరెడ్డి ఈ సమావేశంలో ఆరోపించారు. సొంత పార్టీ క్యాడర్‌పై ఆయన కేసులు పెట్టి వేధించారని రఫీ ఆరోపించారు. ఇంతమంది సంజీవయ్యను వ్యతిరేకిస్తుంటే పెళ్ళకూరు సత్యనారాయణరెడ్డి మాత్రం సంజీవయ్యకు ఎందుకు మద్దతు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఈ సందర్భంగా నాయకులు విమర్శలు చేశారు.మెజార్టీ పార్టీ నాయకులు సూళ్లూరుపేటలో సంజీవయ్యను వ్యతిరేకిస్తున్నారన్న విషయం జగన్ గుర్తించాలని కోరారు. ఆయనకు రానున్న ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఖచ్చితంగా పార్టీకి సహకరించబోమని ముఖ్యనాయకులు ఈ సమావేశంలో తెలియజేశారు.

అనుకూల వర్గంతో ఎమ్మెల్యే సమాలోచనలు

తడ, జనవరి 18: సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య తన అనుకూల వర్గ నాయకులతో గురువారం పూడి వద్ద ఒక హోటల్‌లో సమాలోచనలు జరిపారు. ఆదివారం జరిగే సాధికారిత బస్సు యాత్ర గురించి ఎమ్మెల్యే మాట్లాడినా, అసమ్మతి వర్గం సమావేశం గురించే ఎక్కువగా చర్చ సాగినట్టు తెలిసింది. అసలు నాయకులు చేజారిపోకుండా ఉండేందుకే ఎమ్మెల్యే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారంటూ కొందరు గుసగుసలాడుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, జడ్పీటీసీ ఇందుమతి, వైసీపీ మండల కన్వీనర్ ఆర్ముగం, నాయకులు సుందరరెడ్డి, నత్తం శ్రీను, కోదండం, జయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎన్టీఆర్‌కు నివాళులు



రామచంద్రాపురం, జనవరి 18: మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు , కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు.టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్దన చౌదరి, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, ఢిల్లీనాథరెడ్డి, ధనుంజయరెడ్డి, మండల నాయకులు గిరిబాబు, సురేంద్ర నాయుడు, మునీంద్ర, ప్రసాద్, జీవరత్నం, గిరిధర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, కుప్పారెడ్డి, మహేష్ నాయుడు, రాజమాణిక్యంనాయుడు, మాధవయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

మంగళంలో....



తిరుపతి (రవాణా), జనవరి 18: మంగళం ఉమ్మడి పంచాయతీలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పులివర్తి వినీల్ హాజరయ్యారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, సురేష్ నాయుడు, గోవిందరాజు, పాల చంద్ర, గోపీనాథ్, వేపంజేరి మహేశ్వరి, పెరుగు భాస్కర్‌రెడ్డి, చికెన్ చంద్ర, అల్లాబాషా, అజీజ్‌బాషా, మాతయ్య, రామమూర్తి యాదవ్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరపల్లెలో ....



భాకరాపేట, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ తెలుగు వారికి చిరస్మరణీయుడని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం చిన్నగొట్టిగల్లు మండలం కుమ్మరపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.టీడీపీ నేతలు మదనమోహన, మోహన్ రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, రమణ, విజయశేఖర్ గౌడ్, వెంకటసుబ్బయ్య, లోకనాథం, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, కుమారస్వామి రెడ్డి, మల్లికార్జున రెడ్డి, హైదర్‌వలీ, అల్తాఫ్, చెంగయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో....



పాకాల, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలు గురువారం మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట, ఆర్టీసీ బస్టాండు ఎదుట వున్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముగిసిన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాలు



చంద్రగిరి, జనవరి 18: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి.బుధవారం రాత్రి కొండచుట్టు తిరిగిన అమ్మవారు పలు గ్రామాల మీదుగా గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి చేరుకుంది. మధ్యాహ్నం ఆలయం నుంచి అమ్మవారితో పాటు ధర్మరాజుల ఉత్సవమూర్తులను చంద్రగిరి పురవీధుల్లో భక్తులు వసంతాలు చల్లుకొంటూ ఊరేగింపుగా దాసరివీధి సమీపంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయానికి చేర్చారు.రాత్రి 8 గంటల సమయంలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా అలయానికి తీసుకొచ్చారు. దీంతో ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాలు ముగిసాయి.ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

చంద్రగిరి, జనవరి 18: చంద్రగిరి మండలం, నరసింగాపురం రైల్వే గేటు సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 30 సంవత్సరాల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు గురువారం సాయంత్రం ఒక వ్యక్తి నరసింగాపురం రైల్వే గేటు వద్దకు వచ్చాడు. గేటు వద్ద సిబ్బందిని నీళ్ళడిగాడు. అనంతరం రైలు పట్టాలపై వెళుతుండగా, పట్టాలపైకి వెళ్ళకూడదని సిబ్బంది హెచ్చరించారు.అంతలోనే రైలు కింద పడి చనిపోయాడు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

సీఎంతో సాన్నిహిత్యమున్నా ఒక్క పరిశ్రమ తేలేదు

తెలుగుయువత విమర్శ

పాకాల, జనవరి 18: మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో ఏ ప్రాంతాన్నీ వైసీపీ సర్కారు అభివృద్ధి చేయలేదని చంద్రగిరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కె.సురేష్ చౌదరి విమర్శించారు. గురువారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డికి ముఖ్యమంత్రితో సాన్నిహిత్యం వున్నా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం ఒక పరిశ్రమను కూడా నెలకొల్పలేకపోయారన్నారు. తుడా నిధులతో ఊరూరా నాణ్యత లేని రచ్చబండలు, బల్లలు, సమావేశ మందిరాలు నిర్మిస్తున్నారని విమర్శించారు.అధికారాన్ని అడ్డంపెట్టుకొని అధికారులపై ఒత్తిడితెచ్చి దొంగ ఓట్లు చేర్పిస్తున్నారని విమర్శించారు.టీడీపీ నాయకులు బి.నాగరాజనాయుడు, డేవిడ్ సురేష్, రెడ్డిప్రసాద్, చాముండేశ్వరి, విజయలక్ష్మి, బి.ఈశ్వరచౌదరి, ఆర్వీ ప్రసాద్, డి.మోహన్ నాయుడు, ఎం గౌతమి రమేష్, మోహనకృష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మరణించినా.. ఆ నలుగురిలో..!

బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి నుంచి గుండె, లివర్, కిడ్నీల సేకరణ.. నలుగురికి అమర్చిన వైద్యులు



హేమకుమార్ (ఫైల్‌ఫొటో), కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్విమ్స్ సిబ్బంది

పూతలపట్టు, జనవరి 18: ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని తెలిసి తల్లడిల్లిపోయారు. ఆపై గుండె దిటవు చేసుకున్నారు. వైద్యుల సలహా మేరకు అవయవదానానికి అంగీకరించారు. ఆ యువకుడి నుంచి సేకరించిన గుండె, లివర్, కిడ్నీలను నలుగురికి అమర్చారు. ఇలా తాను మరణించినా.. ఆ నలుగురిలో ఉన్నారు 26 ఏళ్ల హేమకుమార్. ఇతడిది పూతలపట్టు పంచాయతీ సామనత్తం గ్రామం. తల్లిదండ్రులు భారతి, సుబ్రహ్మణ్యం. బీటెక్ వరకు చదివి చిత్తూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మూడురోజులక్రితం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరగా ఎం.బండపల్లె వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన హేమకుమార్‌ను కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. వ్యవసాయ కూలీలైన అతడి తల్లిదండ్రులకు అవయవదానంపై డాక్టర్లు అవగాహన కల్పించారు. వారి అనుమతితో హేమకుమార్ అవయవాలను సేకరించారు. అలా సేకరించిన గుండెను గుంటూరుకు చెందిన 29 ఏళ్ల వ్యక్తికి తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయంలో అమర్చారు. లివర్‌ను గంగవరానికి చెందిన 53 ఏళ్ల మహిళకు.. ఒక కిడ్నీని పూతలపట్టు మండలంకు చెందిన 51 ఏళ్ల మహిళకు.. మరో కిడ్నీని నెల్లూరు జిల్లాకు చెందిన 37 ఏళ్ల మహిళకు అమర్చారు. ఈ ఆపరేషన్లు స్విమ్స్‌లోనే విజయవంతంగా నిర్వహించారు. హేమకుమార్ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు కొనియాడారు. గురువారం సాయంత్రం హేమకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మనం బోర్లలో నీళ్ళు చూస్తే

ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోంది

● కేంద్ర సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్



స్టాళ్లను తిలకిస్తున్న మహిళలు



వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18: మన తాతలు నదులు, కాలువలు చూస్తే, మన తండ్రులు బావులు, బోర్లు చూశారనీ, మనం బోర్లలో నీళ్ళు చూస్తే ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో కట్టెల కోసం అడవికి వెళ్ళినట్టు, నీటి కోసం కూడా వెళ్ళాల్సిన కాలం వస్తుందన్నారు.అందరూ ఆలోచించకపోతే భవిష్యత్తు తరాలు కన్నీళ్ళు చూసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.రాబోయే ప్రమాదాన్ని గుర్తించి రూ. 2 వేల కోట్లతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామ స్థాయిలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఆరోగ్యకర భవిష్యత్తు దిశగా ఆరోగ్యకర గ్రామం అంశంపై తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాటిల్ మాట్లాడుతూ దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్ చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు చెప్పారు.రాబోయే రోజుల్లో దేశ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి సర్పంచుల సూచనలు విలువైనవిగా పరిగణించే అవకాశం ఉంటుందన్నారు.అభివృద్ధి నమూనా రూపకల్పనలో సర్పంచ్ కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు.దేశాభివృద్ధిలో సర్పంచుల, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యం విలువైన చేర్పు అన్నారు.ఆరోగ్యం, ఆయుష్, స్త్రీ శిశు అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, యువజన వ్యవహారాలు, పాఠశాల విద్య మొదలైన శాఖల కార్యదర్శుల సహకారం అవసరమని తెలిపారు. గ్రామ ఆరోగ్య ప్రణాళికను రూపొందించేందుకు వీరంతా కృషి చేయాలన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులను ఈ వర్క్‌షాప్ ద్వారా ఒక్క చోటకు చేర్చగలిగామన్నారు. మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌లోని చర్చాగోష్ఠి, సమాలోచన ద్వారా భవిష్యత్తు ప్రణాళికను పటిష్టంగా రూపొందించుకునే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుడితి రాజశేఖర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో ప్రభాకరరెడ్డి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ చంద్రశేఖర్ కుమార్, జాయింట్ సెక్రటరీ వికాస్ ఆనంద్, జేసీ శుభం బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.

పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరు

హెల్త్ విలేజ్ వర్క్‌షాప్‌కు వివిధ రాష్ట్రాల నుంచి సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి అనేక నిర్మాణాలు చేపట్టామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించామన్నారు. పారిశుధ్యం వైపు దృష్టి సారించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వర్క్‌షాప్ ప్రాంగణంలో ఆరోగ్య గ్రామాల రూపకల్పనకు సంబంధించిన వ్యూహాలు, విధానాలు, చర్యలు, పద్ధతులు, నమూనాలను ప్రదర్శించారు. ఆప్కో వారి చేనేత వస్త్రాలు, టీటీడీ పంచగవ్య ఉత్పత్తులు, ఐసీడీఎస్ వారి పోషకాహార పదార్థాలు, డీఆర్‌డీఏ, శ్రీకాళహస్తి కళంకారి, మాధవమాల కొయ్యబొమ్మలు, మహిళ రైతుల ఉత్పత్తులు, ఎర్రమరెడ్డిపాళెం రాగి పాత్రలు, విజయనగరం ప్రాంతానికి చెందిన చిరు ధాన్యాలు, నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రాంతంలో చెక్కతో తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆయుష్మాన్ భారత్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రదర్శనలు వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి పర్యవేక్షించారు.

ప్రతినిధుల మధ్య విస్తృత చర్చ

రక్త హీనత, వయోభారం గల వారి పరిస్థితులు, అవసరాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. వీరికి అందించాల్సిన వైద్య సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చర్చించి పలు తీర్మానాలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిన్న వాతావరణ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి పరస్పరం చర్చించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ వర్క్‌షాప్ తొలిరోజు కార్యక్రమాల అనంతరం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వినోద, విజ్ఞానదాయక ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మన దేశ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా షడ్ రాగ సమ్మేళనం, అష్టలక్ష్మీ వైభవం, గ్రామీణ ఆరోగ్యంపై మైమ్ అలరించాయి.



తెలుగువారి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక



చంద్రగిరిలో ఎన్టీఆర్‌కు నివాళులు

చంద్రగిరి, జనవరి 18 : తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ నందమూరి తారకరామారావు అని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు అన్నారు. గురువారం చంద్రగిరిలో ఎన్టీఆర్ 28వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టవర్ క్లాక్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాలలో చెరగని ముద్ర వేశారని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, బెల్లంకొండ రమేష్,రాజులగారి వినోద్, గిరిధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, తులసేశ్వరరెడ్డి, ధనంజయరెడ్డి, పులికంటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నారావారిపల్లెలో గ్రామస్తులు ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు.సర్పంచ్ బొబ్బా లక్ష్మిగిరినాయుడు, నాయకులు పాశం చంద్రకుమార్‌నాయుడు, నారా సుబ్రమణ్యంనాయుడు, రాకేషచౌదరి, మాజీ ఎంపీటీసీ హేమాద్రినాయుడు, అంకాలయ్య, శ్రీకాంత్‌చౌదరి, గుడిమల్లం చెంగల్రాయచారి, నారా విజయ్, నారా లతీష్, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి తిరుపతి పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన పోస్టర్లను విడుదల చేస్తున్న సత్యనారాయణరాజు,దక్షిణామూర్తి, కోట వెంకటేశ్వరరావు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18 : నగర పరిధిలోని వినాయకనగర్ క్వార్టర్స్ సమీప మైదానంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 16వ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు డైరెక్టర్ నడింపల్లి సత్యనారాయణరాజు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనలో టీటీడీ, భారతీయ విద్యాభవన్ ప్రచురణలు, అరబిందో సొసైటీ, సైన్స్ యూనివర్సిటీ, విజయవాడ ప్రింటర్స్ మలయాళ మనోరమ ఇలా 70 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, టీటీడీ జేఈవో సదాభార్గవి, ఎస్వీయూ మాజీ వీసీ, భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మురళి పాల్గొంటారన్నారు. సాహిత్యం, సామాజిక శాస్త్రాలు, విద్యా, విజ్ఞానం, పోటీ పరీక్షలు వంటి పుస్తకాలను అందుబాటు ధరలకే విక్రయిస్తున్నామని, ఈ అవకాశాన్ని పుస్తక ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దక్షిణామూర్తి, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలోనూ గోహత్యలు జరుగుతున్నాయి

● టీటీడీ చైర్మన్, ఈవో అడ్డుకోవడంలో విఫలమయ్యారు



తిరుమల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రం కిందనున్న తిరుపతిలోనూ గోహత్యలు జరుగుతున్నాయని, వీటిలో ఆపడంలో టీటీడీ చైర్మన్, ఈవో విఫలమయ్యారని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అనగానే అన్నపూర్ణ అంటారని, కానీ ఆవులను అక్రమంగా తరలిస్తున్న రాష్ట్రం ఏదైనా వుందంటే అది ఆంధ్రప్రదేశే అన్నారు. ఏపీతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో గోవధ చట్టాలను కఠినంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. ఎక్కడ చూసినా గోహత్యలు జరుగుతున్నాయని, వందల లారీల్లో వేల గోవులను ఈ ఐదు రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఏపీ ప్రభుత్వానికి యుగతులసి పార్టీ తరఫున రెండుసార్లు లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా గోవధ చట్టాలను అమలు చేయకపోతే ఏపీలో యుగతులసి పార్టీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందని హెచ్చరించారు.తిరుపతిలో గోవులను చంపకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీటీడీ చైర్మన్, ఈవోపై ఉందన్నారు.

నేడు రాష్ట్రాభివృద్ధిపై ఎస్వీయూలో సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18 : రాష్ట్రాభివృద్ధిపై ఎస్వీ యూనివర్సిటీలో శుక్రవారం సదస్సు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపడతారు.

దొంగ ఓట్లపై నిరసనకు తరలిరండి: జనసేన



తిరుపతి(కొర్లగుంట), జనవరి 18: అధికార పార్టీ నమోదు చేయించిన దొంగోట్లపై శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి జనసైనికులు తరలిరావాలని ఆ పార్టీ నేతలు డాక్టర్.పి.హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం తిరుపతిలో జనసైనికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా దొంగోట్లపై పోరాడాలని అన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా దొంగోటర్లను గుర్తించి ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు. టీడీపీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. అంతకుముందు హరి ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ దొంగోట్లను ప్రోత్సహించే అధికారులు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఒక ఐఏఎస్ అధికారి డేటా నుంచి 30 వేల ఎపిక్ కార్డులను డౌన్‌లోడ్ చేసినట్టు రుజువుకావడంతో ఆయన సస్పెన్షన్‌కు గురైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారులు జాగ్రత్తగా ఉంటూ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర, జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు, డివిజన్ ఇంచార్జులు, వీరమహిళలు పాల్గొన్నారు.

క్షుద్రపూజలకు డబ్బివ్వనన్నందుకు గ్రామ బహిష్కరణ

ఆర్టీసీ ఉద్యోగి దీనగాథ

ఏర్పేడు, జనవరి 18 : క్షుద్రపూజలు చేసేందుకు నగదు చెల్లించను అన్నందుకు గ్రామ బహిష్కరణకు గురైన వుదంతమిది.బాధితుడి కథనం మేరకు... ఏర్పేడు మండలం అముదూరు పంచాయతీ పరమాలపల్లి అటవీప్రాంతానికి దగ్గరగా ఉండే ఓ చిన్న గ్రామం.దళితవాడలో సుమారు150 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇటీవల ఓ మహిళకు దెయ్యాల భయం పట్టుకుంది.రాయలచెరువు ప్రాంతానికి చెందిన హరి అనే భూతవైద్యుడిని సంప్రదించింది. దెయ్యాలు ఊరు చుట్టూ ఉన్నాయని గ్రామాన్ని అష్టదిగ్బంధం చేస్తే కానీ వాటిని తరిమికొట్టలేమని ఆమెను హరి నమ్మించాడు.దీంతో ఆమె అవసరమైన నిధులకోసం గ్రామపెద్దల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేసింది.పొదుపు సంఘంలో లీడర్ కావడంతో మహిళలకు సమస్యను వివరించింది. అది నమ్మిన వారంతా నెలనెలా చెల్లించే రుణం నుంచి రూ.3వేలు ఆమె వద్ద చేర్చారు.16 సంఘాల నుంచి సమారు రూ.8లక్షలు వసూలు చేసి భూతవైద్యుడి చేతిలో పెట్టింది. అదీ చాలకపోవడంతో పెద్దలను ఒప్పించి గ్రామంలో నిల్వ ఉన్న రూ.10లక్షలను కూడా ఇచ్చింది. ఈ తతంగమంతా గత ఏడాది జూలై నుంచి డిసెంబరు వరకు సాగింది.తమ పొదుపు రుణాల డబ్బు భూతవైద్యునికి ఇస్తున్న విషయం తెలుసుకున్న ప్రజా గాయకుడు, ఆర్టీసీ ఉద్యోగి అముదూరు బాలరాజు సంఘమిత్రను ప్రశ్నించాడు. తనకేమీ తెలియదని గ్రూపు లీడర్లు చేస్తున్న నిర్వాకాన్ని ఆమె చెప్పింది.ఇలా చేయడం తప్పని బాలరాజు వారించాడు. అయినా వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గ్రామంలోకి వచ్చి మందలించి వెళ్లారు.దీంతో ఆగ్రహించిన పొదుపు మహిళలు, గ్రామపెద్దలు గత నెల 18న గ్రామంలో పంచాయతీ పెట్టి బాలరాజును నిలదీశారు.గ్రామ కట్టుబాట్లకు తలొగ్గాలని, చేసిన తప్పుకు రూ.లక్ష జరిమానా కట్టాలన్నారు.బాలరాజు ససేమిరా అనడంతో ఊరి నుంచి బహిష్కరించారు. దీంతో బాలరాజు ఊరికి వెలుపలే కుటుంబంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ విషయమై పోలీసులను అడగ్గా అలాంటిదేమీ లేదని చెప్పడం గమనార్హం.

దొంగ ఓటరు ఐడీలను ముద్రించిన నేతలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18 : తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓటరు కార్డులు ముద్రించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రాలేమని నిర్ధారించుకున్న సీఎం జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నోట్లు, దొంగోట్లతో గెలవాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఈసీకి ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో తిరుపతి అప్పటి కమిషనర్ గిరీషా సస్పెన్షన్‌కు అయ్యారని గుర్తు చేశారు. ఈ ప్రక్రియలో సహకరించిన ప్రభుత్వ అధికారులతో పాటు మరికొందరు సస్పెండ్ అయ్యే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వ లాగిన్‌ను దుర్వినియోగం చేసి దొంగ ఓటరు ఐడీ కార్డులు సృష్టించిన నాయకులు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీచేసే అర్హత కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎస్పీకి పార్టీ తరఫున ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై మరోసారి ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల అధికారి లాగిన్‌ను దుర్వినియోగం చేసిన విషయంలో ఐపీసీ 417, 420, 409, 109సెక్షన్ల కింద కేసు నమోదు అయిందని, ఈ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు అందరిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. బీజేపీ నాయకుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ శ్రీహరి, వరప్రసాద్, భాస్కరరావు, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరీషాపై ఈసీ చర్యలు అధికారులకో గుణపాఠం

● టీడీపీ నేతలు హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న పనబాక లక్ష్మి, సుగుణమ్మ

తిరుపతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఆర్వోగా ఉన్నప్పుడు ఉప ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడ్డారని ఎన్నికల కమిషన్ చర్యలకు ఉపక్రమించడం శుభ పరిణామమని టీడీపీ నేతలు అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో వైసీపీ నేతలు అధికారులతో కుమ్మక్కై దొంగ ఓట్ల జాతర చేయకుండా ఉండివుంటే టీడీపీ ఎంపీగా తాను గెలిచి ఉంటానని ఆమె చెప్పారు. గిరీషాతో పాటు దొంగ ఓట్లకు సహకరించిన ఆర్డీవో కనకనరసారెడ్డి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఇతర సిబ్బందితో పాటు పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండు చేశారు. సుగుణమ్మ మాట్లాడుతూ ఉప ఎన్నిక సమయంలో భూమన అభినయ రెడ్డి కార్పొరేటర్‌గా ఉన్నప్పుడే తిరుపతిని దొంగ ఓట్లు మయంగా వ్వార్చేశాడని, ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంకెన్ని అరాచకాలు సృష్టిస్తాడో అర్థం కావడం లేదన్నారు. వైసీపీ నేతల మాటలు విని తలొగ్గిన అధికారులు బలవుతున్నారని, రాబోయే ఎన్నికల్లో కూడా ఇలాంటి అవకతవకలకు పాల్పడే వారిపై మరింత కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులకు ఇదొక గుణపాఠమని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో నాయకులు సురేంద్రకుమార్, పర్వీన్ తాజ్, ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, ఊట్ల సురేంద్ర నాయుడు, కంకణాల రజినీ, పుష్పావతి, జయరామ రెడ్డి, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

తిరుపతి(విద్య), జనవరి 18: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు ఈనెల 22న సెలవు ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. సంఘ ఆధ్వర్యంలో గురువారం జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిశోర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగరాజు, జి.సాంబిరెడ్డి, సహాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షుడు సుభాష్‌చంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.

తుడా మాజీ చైర్మన్ ఎల్బీ ప్రభాకర్‌కు పలువురి నివాళి

పాకాల, జనవరి 18: సీనియర్ రాజకీయ వేత్త, తుడా మాజీ చైర్మన్ ఎల్బీ ప్రభాకర్ నాయుడికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.బుధవారం రాత్రి మృతి చెందిన ఆయనకు పాకాల పట్టణం కమతంపల్లెలో గురువారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి, టీడీపీ నాయకులు పులివర్తి సుధారెడ్డి, వినీల్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.బందార్లపల్లె సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో గురువారం సాయంత్రం ఎల్బీ ప్రభాకర్‌కు దహనక్రియలు నిర్వహించారు.

చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ల ర్యాలీ

చంద్రగిరి, జనవరి 18: చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్లు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు.అనంతరం సీడీపీవో ప్రదీపకు తమ డిమాండ్లపై వినతిపత్రాన్ని అందజేశారు.

పేదలకు అన్నదానం



టీఎన్‌పాళెం వద్ద అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి (రవాణా), జనవరి 18: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తిమ్మినాయుడుపాళెం ముఖద్వారం వద్ద టీడీపీ నేతలు పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధిపై ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారన్నారు. 1984లో ఆయన తిమ్మినాయుడుపాళెం దళితవాడకు వచ్చి స్థానికులతో సహపంక్తి భోజనం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, ఊకా విజయ్‌కుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కాయం వెంకటరత్నం, ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణయాదవ్, సుబ్బుయాదవ్, నరేష్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, మునిరామయ్య, రాజయ్య, రవి మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు

తిరుమల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 72,263 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,518 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు





యుక్తి కపూర్ - టీడీపీ ఎమ్మెల్యేలు

తిరుమల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో టీడీపీ ఎమ్మెల్యేలు బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, ప్రముఖ సీరియల్ నిర్మాత యుక్తి కపూర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 18: తిరుపతిలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం(మహిళ ప్రాంగణం)లో త్వరలో మహిళలకు టైలరింగ్, కారు డ్రైవింగ్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మేనేజరు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్‌కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్, రేషన్‌కార్డు, 3పాస్‌పోర్టు సైజు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు తిరుచానూరు రోడ్డులోని కార్యాలయంలో నేరుగా కానీ లేదా 0877-2238062నంబరును గాని సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పథకాలపై సీఎస్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 18 : జిల్లాలో అమలవుతున్న రీసర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, పీఎంజీ ప్రాజెక్టు, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, మహిళ శిశుసంక్షేమశాఖ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించగా జిల్లాలో పథకాల అమలు తీరును, రీసర్వేపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి వివరించారు. డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లకు కేరాఫ్ తిరుపతి

● సమగ్ర దర్యాప్తు చేపట్టాలి : నవీన్



తిరుపతి (రవాణా), జనవరి 18 : బోగస్ ఓట్లకు తిరుపతి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, దీనిపై ఈసీ సమగ్ర దర్యాప్తు చేపట్టాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ఉన్నతాధికారులే అక్రమాలకు పాల్పడడం బాధాకరమన్నారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల సమయంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న గిరీషాతో పాటు కిందిస్థాయి అధికారుల పనితీరుపై విచారణ జరిపితే పలు విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం కేంద్రంగా సుమారు 30వేల బోగస్ ఓటరుకార్డులు తయారు చేశారని ఆరోపించారు. తిరుపతి జిల్లాలో ఐదేళ్లుగా పనిచేస్తున్న అధికారులను విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారిని సైతం విచారించాలన్నారు. ఎవరి ఒత్తిడితో సదరు కమిషనర్ లాగిన్, పాస్‌వర్డ్ బయటకు ఇచ్చారో నిగ్గు తేల్చాలని కోరారు.

సత్యవేడు అభ్యర్థిగా స్థానికుడే కావాలి



పోస్టర్ చూపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 18: సత్యవేడు నియోజకవర్గానికి స్థానికులనే అభ్యర్థులుగా ప్రకటించాలని యువజన విద్యార్థి ఐక్యవేదిక సత్యవేడు నియోజకవర్గ నాయకుడు భూమా గణేష్ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సత్యవేడు నియోజవర్గానికి సంబంధించి స్థానికేతరులకు టికెట్లు కేటాయిస్తూ అభివృద్ధిని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. స్థానికుల సమస్యలపై అవగాహన లేని వారికి టికెట్లు ఇవ్వడం వల్ల ఫలితం లేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించలేని పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునివేలు, మహేష్, సూర్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల విధుల్లో సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి



ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డికి వినతి ఇస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విద్య), జనవరి 18 : ఇంటర్మీడియట్ పరీక్షలకు సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని విధులను కేటాయించాలని ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ కోరారు. సంఘ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఐవో జీవీప్రభాకర్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు, మూడు దశాబ్దాల బోధనా అనుభవం ఉందని, బోర్డు అధికారుల ఆదేశాల ప్రకారం గతంలో ప్రభుత్వ అధ్యాపకులు నిర్వహించే దాదాపు అన్ని విధులను నిర్వర్తించామని అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో డీఈసీ, ఫ్లైయింగ్‌స్క్వాడ్, కస్టోడియన్స్, స్పాట్‌లో ఏసీవో/ఎస్ఈ/సీఈ వంటి విధులను సీనియారిటీ ప్రాతిపదికన కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ జలగం రామానుజులు, ఉపాధ్యక్షులు ఎస్.చెంగల్‌రాజు, ఎ.సురేంద్ర, మహిళా కార్యదర్శి పి.సావిత్రిబాయి, గౌరవ సలహాదారుడు కె.మునిరత్నం, సభ్యులు సంజీవరావు, డాక్టర్ శోభ సుప్రజారాణి, రమాదేవి, వెంకటసురేష్, భరణికుమార్, సోమనాథ్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ టిన్‌ల విక్రయానికి సీల్డ్ కవర్ టెండర్ల ఆహ్వానం: టీటీడీ

తిరుమల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పుప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల అమ్మకానికి రేటు కాంట్రాక్ట్ కింద సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. టెండరు పొందిన వారు 2024 డిసెంబరు వరకు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్‌లు సేకరించవచ్చునని పేర్కొంది. తిరుపతి హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాల్సి ఉంటుందని తెలిపింది. ఇతర వివరాలకు మార్కెటింగ్ విభాగం కార్యాలయాన్ని 0877-2264429 నంబరు ద్వారా సంప్రదించవచ్చునని పేర్కొంది.

స్మృతివనాన్ని ప్రారంభించే అర్హత సీఎంకు లేదు : కాంగ్రెస్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18: రాష్ట్రంలో దళితులకు తీరని అన్యాయం చేసి వారి జీవితాలను చిన్నాభిన్నం చేసిన సీఎం జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి గౌడ పేర చిట్టిబాబు విమర్శించారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీల అభ్యున్నతి కోసం కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు.జగన్ సీఎం అయ్యాక ఎంతోమంది దళితులు ఆత్మహత్య చేసుకున్నారని, పలువురిపై అక్రమ కేసులు బనాయించారని, దళిత మహిళలు అత్యాచారానికి గురయ్యారని ఆరోపించారు.

పాఠ్యపుస్తకాలు లేకుండా పరీక్షలకు సన్నద్ధం ఎలా..!

నేటినుంచి ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

పాలకుల అనాలోచిత నిర్ణయాలతో

పేదవిద్యార్థులకు తప్పని అవస్థలు

తిరుపతి(విద్య), జనవరి 18 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో పాలకుల బాధ్యతారాహిత్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.పుస్తకాలందించకుండా మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతారని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరుకోవడం అత్యాశే అవుతుందని అధ్యాపకవర్గాలు అంటున్నాయి.విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని పదేపదే చెప్పుకునే సీఎం జగన్ పరిపాలన ఆచరణలో ఎలా ఉందన్నదానికి ఈ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీయే నిదర్శనంగా నిలుస్తోంది. దాదాపుగా విద్యా సంవత్సరం ముగిసి మరో 50రోజుల వ్యవధిలో అంటే మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రీ ఫైనల్ పరీక్షలు నేటినుంచి జరగనున్నాయి.చాలామంది విద్యార్థులకు ఇప్పటికీ పుస్తకాలందలేదు.నిజానికి ఏపీలో పుష్కరకాలానికి పైగా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేవారు.2008-09నుంచి 2012-13 వరకు టీటీడీ ఈ పుస్తకాలకు నిధులు ఇవ్వగా..2014-2020వరకు ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి నిధులతో ఉచిత పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేసేవారు. అయితే రెండేళ్లుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదు. ఓల్డ్‌స్టాక్ కింద ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. కొన్ని కాలేజీల్లో ప్రిన్సిపాళ్లే చొరవచూపి సీనియర్ విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలను తీసి కొంతమందికి సర్దుబాటు చేయగా.. ఎక్కువసంఖ్యలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేకుండానే చదువులు పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ప్రథమ ఇంటర్‌లో 51శాతం ఉత్తీర్ణతతో వెనుకబడి ఒత్తిడిలో ఉన్న అధ్యాపకులకు ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ఎలాఅని మధనపడుతున్నారు. మరో పక్క పుస్తకాలు లేకుండా చదువులు సాగించిన తమ పిల్లలకు పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది.

తిరుపతి జిల్లాలో

జిల్లాలోని 34మండలాల్లో 21ప్రభుత్వ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల వున్నాయి.ప్రథమ ఇంటర్‌లో 2,346మంది, ద్వితీయ ఇంటర్‌లో 1,977మంది విద్యార్థులు చదువుతున్నారు.అన్ని సబ్జెక్టులకు కలిపి ప్రథమలో 21,658, ద్వితీయలో 18,658పుస్తకాల కోసం ఇంటర్‌బోర్డుకు ఇండెంట్ పంపారు.జిల్లాలో 25హైస్కూళ్లను బాలికలజూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటితోపాటు రెండు కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో ఇంటర్‌కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కూడా ప్రభుత్వమే ఉచిత పుస్తకాలు అందించాల్సి ఉండగా.. పాతస్టాక్ ఉన్న వివిధ టైటిల్స్‌కి సంబంధించి దాదాపు 3,500 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడిజిల్లాలో

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 62ప్రభుత్వ, 2ఏపీఆర్‌జేసీ, 16కేజీబీవీ, 18 ఏపీమోడల్, 11 సాంఘిక సంక్షేమ, 2ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 10వేలమందికిపైగా విద్యార్థులున్నట్లు సమాచారం. కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు గానీ పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు. పాఠ్యపుస్తకాలను ముద్రించకుండా ప్రైవేట్ మార్కెట్‌లో విద్యార్థులు కొనుక్కోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. అయితే గతేడాది జిల్లాలో గ్రౌండ్ బ్యాలెన్స్ కింద ఉన్న దాదాపు 10శాతం పుస్తకాలను కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లారని అధికారులు అంటున్నారు.

విద్యార్థులకు సర్దుబాటు చేశాం

సీనియర్ విద్యార్థుల వద్ద ఉన్న పుస్తకాలను జూనియర్లకు అందించి చాలావరకూ సర్దుబాటు చేశాం. ఓల్డ్‌స్టాక్ ఉన్న కొన్ని టైటిల్స్ కూడా ప్రిన్సిపాళ్లకు అందించాం. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

-స్వర్ణలత, డీఐఈవో

అప్పటి కలెక్టర్, ఎస్పీలను సస్పెండ్ చేయాలి : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18 : తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన కలెక్టర్, ఎస్పీలను ఈసీ సస్పెండ్ చేయాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దొంగ ఓటరు ఐడీ కార్డుల ముద్రణలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఉప మేయర్ అభినయ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ప్రమేయం ఉందని తేలితే వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దుచేసి టీడీపీ తరపున పోటీ చేసిన పనబాక లక్ష్మి విజయం సాధించినట్లు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల అధికారి లాగిన్ దుర్వినియోగం చేసినందుకు అప్పటి కమిషనర్‌ను ఈసీ సస్పెండ్ చేయడాన్ని టీడీపీ హర్షిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 22న ఓటరు తుది జాబితా విడుదలను వాయిదా వేసి తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేటలో దొంగ ఓట్లపై వెరిఫికేషన్ చేసి, ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలన్నారు. ఇప్పటికే పోస్టల్ శాఖ ద్వారా పంపిన ఓటరుకార్డులు 80శాతం తిరిగి వెనక్కు వచ్చాయని, వాటిపై కలెక్టర్, కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకటగిరిలో జరిగే రా కదలిరా కార్యక్రమానికి జిల్లాలోని టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు ఊకా విజయకుమార్, శ్రీధర్‌వర్మ, రవినాయుడు, యశ్వంత్ రెడ్డి, మనోహర్ ఆచారి, సుబ్బుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించాడని పక్కనపెట్టేశారు

● స్విమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అధ్యక్షుడిపై అకారణ వేటు

● న్యాయం కోసం రేపటి నుంచి నిరాహార దీక్ష



తిరుపతి- ఆంధ్రజ్యోతి : 'సమాన పనికి సమాన వేతనం కావాలన్నాడు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చమని డిమాండు చేశాడు. రెగ్యులర్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ కింద నెలకు రూ.225 కట్టించుకుంటే, గొడ్డు చాకిరీ చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల నుంచి మాత్రం హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో రూ.500 వసూలు చేయడమేమిటని ప్రశ్నించాడు. మహిళా ఉద్యోగులు వేధింపులకు గురవుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగులందరినీ ఏకంచేసి మా బాధలు పట్టించుకోండి...అంటూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు గళమెత్తాడు. తట్టుకోలేని యంత్రాంగం ఉద్యోగం నుంచి అతన్ని తొలగించివేసింది. తనను ఎందుకు తీసేశారో కారణం చెప్పండంటూ ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాడు. ఇక న్యాయం జరగదని నిర్ధారించుకుని నిరాహారదీక్షకు సిద్ధమయ్యాడు స్విమ్స్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి. శనివారం నుంచి స్విమ్స్ డైరెక్టర్ వద్ద పోరాటానికి సిద్ధమవుతున్న ఆయన 'ఆంధ్రజ్యోతి'తో తన గోడు వెలిబుచ్చాడు. 2012 నుంచి స్విమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా వైరాలజీ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నానన్న కారణంతో శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్ సీఈవో విచారణకు హాజరు కావాలని పిలిచారని, స్విమ్స్‌లో జరుగుతున్న విషయాలు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. స్విమ్స్ రెగ్యులర్ యూనియన్‌లో కొందరు, ఒక డైరెక్టర్ స్థాయి అధికారి సిఫారసుతో తనను ఉద్యోగంలోకి తీసుకోలేదన్నారు. ధార్మిక సంస్థలో పనిచేసే అధికారులు కక్ష సాధింపుతో చిరుద్యోగులను వేధిస్తున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని, అందుకే న్యాయం కోసం నిరాహార దీక్షకు వెళుతున్నానని చెప్పారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగుల ఇంటి స్థలాలపై 20న సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18 : తుమ్మలగుంట మార్గంలోని శివాలయం వద్ద ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న సమావేశానికి ఎస్వీ పూర్‌హోమ్, ఎస్వీ డెయిరీ ఫాం వద్ద 2008లో ఇంటి స్థలాలు పొందిన టీటీడీ పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు తప్పక హాజరు కావాలని టీటీడీ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నా భాస్కర్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2008లో టీటీడీలో 1973నుంచి 1980 వరకు వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగులకు తిరుపతి ఎస్వీ పూర్‌హోమ్, ఎస్వీ డెయిరీ ఫాం వద్ద ఇంటిస్థలాలు మంజూరు చేశారన్నారు. అందులో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న క్రమంలో తిరుపతి ఆలయాల పరిరక్షణ సమితి హైకోర్టులో వాజ్యం వేసి స్టే తీసుకువచ్చిందని తెలిపారు. 2013లో హైకోర్టులో టీటీడీ ఉద్యోగులకు అనుకూలమైన తీర్పు రావడంతో 2014 మళ్లీ వారు సుప్రీం కోర్టులో స్టే తీసుకువచ్చారని పేర్కొన్నారు. వాదోపవాదనలు తుదిస్థాయికి చేరిన క్రమంలో టీటీడీ న్యాయవాదిని కేటాయించకపోవడం, అందరితో పాటు తమకూ స్థలాలు కేటాయిస్తామని చెప్పడంతో అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయమై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో శ్రీనివాసన్, పీతాంబరరాజు, చిన్నయ్య, సెల్వరాజ్, నాగరాజు, గుణశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.





తెలుగుజాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

వర్ధంతి కార్యక్రమాల్లో టీడీపీ నేతల ఉద్ఘాటన



పద్మావతీ మహిళా వర్సిటీలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని

తిరుపతి, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతికి ఆత్మగౌరవం తీసుకొచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ నేతలు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తిరుపతి టౌన్‌క్లబ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాలాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరు సాంబశివరావు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు చట్టం తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. ఆయన ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నివాళులర్పించిన వారిలో నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్, నేతలు నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, బుల్లెట్ రమణ, రవినాయుడు, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, కంకణాల రజినీకాంత్, తిరుమల కేశవులు, భాస్కర్, రుద్రకోటి సదాశివం, ఆముదాల తులసీ, పెరుమాళ్ మధుబాబు, బ్యాంకు శాంతమ్మ, జయరామ రెడ్డి, ఆనంద్ గౌడ్, కరాటే చంద్ర, ఆర్సీ శ్రీనివాస్, కృష్ణ యాదవ్, సుబ్బు యాదవ్, దినకర్, సుభాష్, విశ్వనాథం, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల మౌనదీక్ష



తిరుపతి (రవాణా), జనవరి 18 : సమస్యల పరిష్కారం కోసం 38 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు గురువారం సంతకాల సేకరణతో పాటు మౌనదీక్ష చేపట్టారు. అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ, జయప్రభ, గంగాదేవి మాట్లాడుతూ 38 రోజులుగా రోడ్లపై కూర్చుని సమ్మె చేస్తుంటే సీఎం జగన్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. జీతాలు పెంచేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. రైతు పోరాటం తరహాలో ముందుకెళ్లి హక్కులు సాధించుకుంటామే తప్పా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన, నిరవధిక నిరాహార దీక్షకు వెళ్లబోతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని కోరారు. లేదంటే సీఎం ఇంటిని ముట్టడించడానికి వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత, కల్పన, గోమతి, ఎల్లమ్మ, వరలక్ష్మి, సుజిత, సుజాత, రోజా, యువరాణి పాల్గొన్నారు.

రేపు రాస్తారోకో

తిరుపతి(కొర్లగుంట), జనవరి 18: అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా శనివారం రాస్తారోకో చేపట్టాలని ఏటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు నిర్ణయించాయి. సీపీఐ కార్యాలయంలో గురువారం ఎస్.చంద్రశేఖరరెడ్డి, కె.రాధాకృష్ణ(ఏఐటీయూసీ), కందారపు మురళి (సీఐటీయూ), కె.సుబ్రహ్మణ్యం(ఐఎఫ్‌టీయూ) సమావేశమై ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా చేపట్టనున్న ఈ రాస్తారోకోలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దొంగ ఓట్లకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 18: తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో దొంగోట్లకు సహకరించిన 15మంది ప్రభుత్వ అధికారులపై ఈసీ చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగోట్లకు సహకరించిన అప్పటి తిరుపతి నగరపాలకసంస్థ కమిషనర్, ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషాను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మిగిలిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి ఉప కమిషనర్, ప్రస్తుత కమిషనర్ హరిత లాగిన్ నుంచి 40వేల దొంగోట్లు నమోదు జరిగినట్లు అనుమానంగా ఉందన్నారు. కడప, కోడూరు, రాజంపేటకు చెందిన వ్యక్తులను ఓటర్లుగా చేర్పించి గెలిచేందుకు కుట్రలు చేశారని తెలిపారు. కమిషనర్ హరితకు సొంతూర్లో పోస్టింగ్ ఇవ్వడమే కాకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే ఆమెను బదిలీ చేసి, దొంగోట్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, మునస్వామి, బాబ్జి, హేమకుమార్, రాజేష్ ఆచారి, మనోజ్, షరీఫ్, వంశీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మరణించినా.. ఆ నలుగురిలో..!

బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి నుంచి గుండె, లివర్, కిడ్నీల సేకరణ.. నలుగురికి అమర్చిన వైద్యులు



హేమకుమార్ కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్విమ్స్ సిబ్బంది



హేమకుమార్ (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, జనవరి 18: ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని తెలిసి తల్లడిల్లిపోయారు. ఆపై గుండె దిటవు చేసుకున్నారు. వైద్యుల సలహా మేరకు అవయవదానానికి అంగీకరించారు. ఆ యువకుడి నుంచి సేకరించిన గుండె, లివర్, కిడ్నీలను నలుగురికి అమర్చారు. ఇలా తాను మరణించినా.. ఆ నలుగురిలో ఉన్నారు 26 ఏళ్ల హేమకుమార్. ఇతడిది పూతలపట్టు పంచాయతీ సామనత్తం గ్రామం. తల్లిదండ్రులు భారతి, సుబ్రహ్మణ్యం. బీటెక్ వరకు చదివి చిత్తూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మూడురోజులక్రితం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరగా ఎం.బండపల్లె వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన హేమకుమార్‌ను కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. వ్యవసాయ కూలీలైన అతడి తల్లిదండ్రులకు అవయవదానంపై డాక్టర్లు అవగాహన కల్పించారు. వారి అనుమతితో హేమకుమార్ అవయవాలను సేకరించారు. అలా సేకరించిన గుండెను గుంటూరుకు చెందిన 29 ఏళ్ల వ్యక్తికి తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయంలో అమర్చారు. లివర్‌ను గంగవరానికి చెందిన 53 ఏళ్ల మహిళకు.. ఒక కిడ్నీని పూతలపట్టు మండలంకు చెందిన 51 ఏళ్ల మహిళకు.. మరో కిడ్నీని నెల్లూరు జిల్లాకు చెందిన 37 ఏళ్ల మహిళకు అమర్చారు. ఈ ఆపరేషన్లు స్విమ్స్‌లోనే విజయవంతంగా నిర్వహించారు. అంతటి విషాదంలోనూ హేమకుమార్ తల్లిదండ్రులు తీసుకున్న త్యాగపూరిత నిర్ణయాన్ని పలువురు కొనియాడారు. గురువారం సాయంత్రం హేమకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

20నుంచి తిరుపతి పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన పోస్టర్లను విడుదల చేస్తున్న సత్యనారాయణరాజు,దక్షిణామూర్తి, కోట వెంకటేశ్వరరావు

తిరుపతి(తిలక్ రోడ్), జనవరి 18 : నగర పరిధిలోని వినాయకనగర్ క్వార్టర్స్ సమీప మైదానంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 16వ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు డైరెక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనలో టీటీడీ, భారతీయ విద్యాభవన్ ప్రచురణలు, అరబిందో సొసైటీ, సైన్స్ యూనివర్సిటీ, విజయవాడ ప్రింటర్స్, మలయాళ మనోరమ ఇలా 70 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ జేఈవో సదాభార్గవి, ఎస్వీయూ మాజీ వీసీ, భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మురళి పాల్గొంటారన్నారు. సాహిత్యం, సామాజిక శాస్త్రాలు, విద్యా, విజ్ఞానం, పోటీ పరీక్షలు వంటి పుస్తకాలను అందుబాటు ధరలకే విక్రయిస్తున్నామని, ఈ అవకాశాన్ని పుస్తక ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దక్షిణామూర్తి, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలోనూ గోహత్యలు జరుగుతున్నాయి

- టీటీడీ చైర్మన్, ఈవో అడ్డుకోవడంలో విఫలమయ్యారు
- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్



తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రం కిందనున్న తిరుపతిలోనూ గోహత్యలు జరుగుతున్నాయని, వీటిలో ఆపడంలో టీటీడీ ఛైర్మన్, ఈవో విఫలమయ్యారని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అనగానే అన్నపూర్ణ అంటారని, కానీ ఆవులను అక్రమంగా తరలిస్తున్న రాష్ట్రం ఏదైనా వుందంటే అది ఆంధ్రప్రదేశే అన్నారు. ఏపీతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో గోవధ చట్టాలను కఠినంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. ఎక్కడ చూసినా గోహత్యలు జరుగుతున్నాయని, వందల లారీల్లో వేల గోవులను ఈ ఐదు రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఏపీ ప్రభుత్వానికి యుగతులసి పార్టీ తరపున రెండుసార్లు లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా గోవధ చట్టాలను అమలు చేయకపోతే ఏపీలో యుగతులసి పార్టీ ప్రత్యక్ష కార్యచరణకు దిగుతుందని హెచ్చరించారు.తిరుపతిలో గోవులను చంపకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీటీడీ చైర్మన్, ఈవోపై ఉందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

గూడూరు, జనవరి 18: ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉన్న స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 94925 78238, 86398 35953, 94401 68907 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గురునాథస్వామి గ్రామోత్సవం

చిల్లకూరు, జనవరి 18: తూర్పుకనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం నుంచి ఏడాదిపండుగ సందర్భంగా గురువారం గురునాథస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు.

'రా..కదలిరా' సభను విజయవంతం చేద్దాం: టీడీపీ

నాయుడుపేట, జనవరి 18: టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం వెంకటగిరిలో నిర్వహించనున్న 'రా.. కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేద్దామని పార్టీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన స్వగృహంలో గురువారం టీడీపీ నేతలతో సమీక్షించారు. నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కుంభంపాటి విజయరామిరెడ్డి, పెంచలకోన దేవస్థాన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజి, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, జిల్లా కార్యదర్శి దార్ల రాజేంద్ర, నానాబాల సుబ్బారావు, శ్రీరాం ప్రసాద్, షేక్ ఖలీల్, అకుతోట రమేష్, శంకర్‌యాదవ్, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారీగా జనం తరలిరావాలి



మాధవనాయుడు

డక్కిలి, జనవరి 18: వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న చంద్రబాబు బహిరంగ సభకు జనం భారీగా తరలిరావాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు పిలుపునిచ్చారు. గురువారం డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు సభలకు వస్తున్న జనాన్ని చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు. 2029 నాటికి వైసీపీ నామరూపాలు లేకుండా పోతుందని భావించిన ఆ పార్టీ నాయకులు.. టీడీపీ, కాంగ్రెస్‌వైపు చూస్తున్నారన్నారు. ఇక వెంకటగిరిలోనూ కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధిస్తారన్న సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపారు. చంద్రబాబ సభకు జనసేన కార్యకర్తలు, అభిమానులు కూడా తరలిరావాలని కోరారు.



టీడీపీ నేతలతో సమీక్షిస్తున్న గంగాప్రసాద్

మనం బోర్లలో నీళ్ళు చూస్తే.. ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోంది

- కేంద్ర సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18: మన తాతలు నదులు, కాలువలు చూస్తే, మన తండ్రులు బావులు, బోర్లు చూశారనీ, మనం బోర్లలో నీళ్ళు చూస్తే ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో కట్టెల కోసం అడవికి వెళ్ళినట్టు, నీటి కోసం కూడా వెళ్ళాల్సిన కాలం వస్తుందన్నారు.అందరూ ఆలోచించకపోతే భవిష్యత్తు తరాలు కన్నీళ్ళు చూసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.రాబోయే ప్రమాదాన్ని గుర్తించి రూ. 2 వేల కోట్లతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామ స్థాయిలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఆరోగ్యకర భవిష్యత్తు దిశగా ఆరోగ్యకర గ్రామం అంశంపై తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పాటిల్ మాట్లాడుతూ దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్ చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు చెప్పారు.రాబోయే రోజుల్లో దేశ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి సర్పంచుల సూచనలు విలువైనవిగా పరిగణించే అవకాశం ఉంటుందన్నారు.అభివృద్ధి నమూనా రూపకల్పనలో సర్పంచ్ కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు.దేశాభివృద్ధిలో సర్పంచుల, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యం విలువైన చేర్పు అన్నారు.ఆరోగ్యం, ఆయుష్, స్త్రీ, శిశు అభివృద్ధి, తాగు నీరు, పారిశుద్యం, యువజన వ్యవహారాలు, పాఠశాల విద్య మొదలైన శాఖల కార్యదర్శుల సహకారం అవసరమని తెలిపారు. గ్రామ ఆరోగ్య ప్రణాళికను రూపొందించేందుకు వీరంతా కృషి చేయాలన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులను ఈ వర్క్‌షాప్ ద్వారా ఒక్క చోటకు చేర్చగలిగామన్నారు. మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌లోని చర్చాగోష్ఠి, సమాలోచన ద్వారా భవిష్యత్తు ప్రణాళికను పటిష్టంగా రూపొందించుకునే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుడితి రాజశేఖర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో ప్రభాకరరెడ్డి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ చంద్రశేఖర్ కుమార్, జాయింట్ సెక్రటరీ వికాస్ ఆనంద్, జేసీ శుభం బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్య ప్రదర్శన

పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరు

హెల్త్ విలేజ్ వర్క్‌షాప్‌కు వివిధ రాష్ట్రాల నుంచి సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి అనేక నిర్మాణాలు చేపట్టామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించామన్నారు. పారిశుద్యం వైపు దృష్టి సారించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వర్క్‌షాప్ ప్రాంగణంలో ఆరోగ్య గ్రామాల రూపకల్పనకు సంబంధించిన వ్యూహాలు, విధానాలు, చర్యలు, పద్ధతులు, నమూనాలను ప్రదర్శించారు. ఆప్కో వారి చేనేత వస్త్రాలు, టీటీడీ పంచగవ్య ఉత్పత్తులు, ఐసీడీఎస్ వారి పోషకాహార పదార్థాలు, డీఆర్‌డీఏ, శ్రీకాళహస్తి కళంకారి, మాధవమాల కొయ్య బొమ్మలు, మహిళ రైతుల ఉత్పత్తులు, ఎర్రమరెడ్డిపాళెం రాగి పాత్రలు, విజయనగరం ప్రాంతానికి చెందిన చిరు ధాన్యాలు, నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రాంతంలో చెక్కతో తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆయుష్మాన్ భారత్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రదర్శనలు వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి పర్యవేక్షించారు.



స్టాల్స్‌ను తిలకిస్తున్న మహిళలు

ప్రతినిధుల మధ్య విస్తృత చర్చ

రక్త హీనత, వయోభారం గల వారి పరిస్థితులు, అవసరాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. వీరికి అందించాల్సిన వైద్య సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చర్చించి పలు తీర్మానాలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిన్న వాతావరణ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి పరస్పరం చర్చించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ వర్క్‌షాప్ తొలిరోజు కార్యక్రమాల అనంతరం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వినోద, విజ్ఞానదాయక ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మన దేశ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా షడ్‌రాగ సమ్మేళనం, అష్టలక్ష్మీ వైభవం, గ్రామీణ ఆరోగ్యంపై స్కిట్ అలరించాయి.

మరమ్మతులకు గురైన 108 వాహనాలు

- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు



గాయపడిన రమణయ్య

సూళ్లూరుపేట, జనవరి 18: చాలాచోట్ల 108 వాహనాలు మరమ్మతులకు గురై ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోక పోవడంతో బాధితుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని జనం వాపోతున్నారు. బుధవారం రాత్రి అట్టకానితిప్ప వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న హరికృష్ణ (28) అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనం కోసం ఫోన్ చేయగా.. మరమ్మతులకు గురై ఉందని చెప్పారు. పక్కనేఉన్న దొరవారిసత్రం, తడ మండలాలకు చెందిన 108 వాహనాల పరిస్థితీ ఇదే కావడంతో అందుబాటులో ఉన్న వాహనంలో శ్రీహరికోట ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం సూళ్లూరుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం సూళ్లూరుపేట బాపూజీవీధి గడియారం సెంటర్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో దొరవారిసత్రం మండలం ఏకొల్లుకు చెందిన రమణయ్యకు తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లారు. స్థానికులు 108 కోసం ప్రయత్నించగా మరమ్మతులకు గురై ఉందని సిబ్బంది సమాధానం చెప్పారు. దాంతో బాధితుడిని మోటారు సైకిల్‌పై సమీపంలో ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బలమైన గాయాలు తగలపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇకనైనా 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని జనం కోరుతున్నారు.

క్షుద్రపూజలకు డబ్బివ్వనన్నందుకు
గ్రామ బహిష్కరణ

ఆర్టీసీ ఉద్యోగి దీనగాథ

ఏర్పేడు, జనవరి 18 : క్షుద్రపూజలు చేసేందుకు నగదు చెల్లించను అన్నందుకు గ్రామ బహిష్కరణకు గురైన వుదంతమిది.బాధితుడి కథనం మేరకు... ఏర్పేడు మండలం అముడూరు పంచాయతీ పరమాలపల్లి అటవీప్రాంతానికి దగ్గరగా ఉండే ఓ చిన్న గ్రామం.దళితవాడలో సుమారు150 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇటీవల ఓ మహిళకు దెయ్యాల భయం పట్టుకుంది.రాయలచెరువు ప్రాంతానికి చెందిన హరి అనే భూతవైద్యుడిని సంప్రదించింది. దెయ్యాలు ఊరు చుట్టూ ఉన్నాయని గ్రామాన్ని అష్టదిగ్బంధం చేస్తే కానీ వాటిని తరిమికొట్టలేమని ఆమెను హరి నమ్మించాడు.దీంతో ఆమె అవసరమైన నిధులకోసం గ్రామ పెద్దల మద్ధతు కూడగట్టే ప్రయత్నం చేసింది.పొదుపు సంఘంలో లీడర్ కావడంతో మహిళలకు సమస్యను వివరించింది. అది నమ్మిన వారంతా నెలనెలా చెల్లించే రుణం నుంచి రూ.3వేలు ఆమె వద్ద చేర్చారు.16 సంఘాల నుంచి సమారు రూ.8లక్షలు వసూలు చేసి భూతవైద్యుడి చేతిలో పెట్టింది. అదీ చాలకపోవడంతో పెద్దలను ఒప్పించి గ్రామంలో నిల్వ ఉన్న రూ.10లక్షలను కూడా చ్చింది. ఈ తతంగమంతా గత ఏడాది జూలై నుంచి డిసెంబరు వరకు సాగింది.తమ పొదుపు రుణాల డబ్బు భూతవైద్యునికి ఇస్తున్న విషయం తెలుసుకున్న ప్రజా గాయకుడు, ఆర్టీసీ ఉద్యోగి అముడూరు బాలరాజు సంఘమిత్రను ప్రశ్నించాడు. తనకేమీ తెలియదని గ్రూపు లీడర్లు చేస్తున్న నిర్వాకాన్ని ఆమె చెప్పింది.ఇలా చేయడం తప్పని బాలరాజు వారించాడు. అయినా వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గ్రామంలోకి వచ్చి మందలించి వెళ్లారు.దీంతో ఆగ్రహించిన పొదుపు మహిళలు, గ్రామపెద్దలు గత నెల 18న గ్రామంలో పంచాయతీ పెట్టి బాలరాజును నిలదీశారు.గ్రామ కట్టుబాట్లకు తలొగ్గాలని, చేసిన తప్పుకు రూ.లక్ష జరిమానా కట్టాలన్నారు.బాలరాజు ససేమిరా అనడంతో ఊరి నుంచి బహిష్కరించారు. దీంతో బాలరాజు ఊరికి వెలుపలే కుటుంబంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ విషయమై పోలీసులను అడగ్గా అలాంటిదేమీ లేదని చెప్పడం గమనార్హం.

అట్టహాసంగా ముగిసిన ఏటి పండుగ



స్వర్ణముఖినదిలో ఆటలాడుతున్న మహిళలు

నాయుడుపేట, జనవరి 18: స్వర్ణముఖినదిలో ఏటి పండుగ గురువారంతో అట్టహాసంగా ముగిసింది. కనుమ నుంచి జరిగే ఈ పండుగకు చివరి రోజున భారీగా జనం తరలివచ్చారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. బుల్లితెర యాంకర్ కావ్య సందడి చేయగా, ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలు అలరించాయి.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: చింతా మోహన్



వెంకటగిరిలో చింతామోహన్ ప్రచారం

వెంకటగిరి, జనవరి 18: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గురువారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన పోలేరమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు ఇళ్లు, దుకాణాల్లో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

బీజేపీపై టీడీపీ వైఖరి ఏంటనేది చంద్రబాబు వెల్లడించాలి

డక్కిలి: బీజేపీపై టీడీపీ వైఖరి ఏంటనేది మాజీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని చింతామోహన్ అన్నారు. గురువారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ.. పేదలకు కూడు, గుడ్డ, గూడు కల్పించిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. వెంకటగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

జాతీయ క్రీడాకారుడికి మంత్రి అభినందన



రూపేంద్రను అభినందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 18: నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రూపేంద్రను గురువారం తన కార్యాలయంలో మంత్రి రోజా అభినందించారు. పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన రూపేంద్ర 69వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజక వర్గంలో ఉత్తమ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ గోపిని కూడా అభినందించారు.

విజేతలకు నగదు బహుమతి



ప్రథమ స్థానంలో నిలిచిన జట్టులోని క్రీడాకారులు

పుత్తూరు, జనవరి 18: పుత్తూరు చర్చి కాంపౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతులను తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్, 10వ వార్డు బూత్ కన్వీనర్ డిజి ధనపాల్ అందించారు. ప్రథమ బహుమతిగా రూ.10వేలను గోవిందమ్మ జట్టు, ద్వితీయ బహుమతిగా రూ.8వేలను ఫ్రెండ్స్ 11 జట్టు, తృతీయ బహుమతిగా రూ.2వేలను అవెంజర్స్ జట్లు అందుకున్నాయి.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

వడమాలపేట, జనవరి 18: జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండలస్థాయి ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. 12 సచివాలయాలకు సంబంధించిన జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలో బాలినాయుడు కండ్రిగ జట్టు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఎంపికైంది. సచివాలయ కార్యదర్శులు వలంటీర్లు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రాజు, శివప్రసాద్, నాగేంద్ర, రూపలత, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డున పడేసిన ప్రభుత్వం

- అంగన్వాడీల ఆవేదన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు, జనవరి 18: సంక్రాంతి పండుగ లేకుండా తమను ప్రభుత్వం రోడ్డున పడేసిందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న దీక్షా శిబిరం నుంచి గురువారం రెండు కిలోమీటర్ల దూరంలోని సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు విధుల్లో చేరబోమని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుకు వివరణ లేఖను సీడీపీవో వద్మజకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు బెదరమని లేఖలో తెలిపారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, మోహన్‌లక్ష్మి, కృష్ణవేణి, గంగులమ్మ, లలిత, ప్రమీల, హైమావతి పాల్గొన్నారు.

రామ రాజ్యం.. చంద్రన్నతోనే సాధ్యం

వాడవాడలా ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పుత్తూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, జనవరి 18: రామ రాజ్యం.. చంద్రన్నతోనే సాధ్యమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఆర్టీసీ కాలనీ వద్ద టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే వాసన్ ఐకేర్, నారాయణాద్రి వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం, పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీవరత్నం నాయుడు, రవికుమార్, ధనపాల్, బాలాజి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చెంచయ్య, ఐటీడీపీ కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, నాయకులు ఖాజాపీర్, తురబ్, హమీద్, మహమ్మద్ రఫీ, బసంతి, నాగరత్న, మోహన, యుగంధర్, కరుణాకర్ యాదవ్, ఆదిమందడి, వెంకటేష్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



వడమాలపేటలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

వడమాలపేటలో..

వడమాలపేట, జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వడమాలపేటలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జానా వెంకటయ్య, ధనంజయులు నాయుడు, మణిరాజు, హేమావతి, లక్ష్మీప్రసన్న, పెద్దబ్బరాజు, వెంకటేశ్వరరావ్, ఉమాపతిరావ్, దాముయాదవ్, ధనలక్ష్మి, రాధాకృష్ణ, శివరాయల్, బత్తినాయుడు, అంజయ్య, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..



నారాయణవనంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

నారాయణవనం, జనవరి 18: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూల మాలలు వేసి.. నివాళులర్పించారు. నాయకులు గంజి మాధవయ్య, గిరిబాబు, షణ్ముగం, రవి, రమేష్, బాబు, కందస్వామినాయుడు, జయచంద్రనాయుడు, విజయ్, బాలసుబ్రహ్మణ్యం, ప్రేమ్‌కుమార్, నరేష్, వాసుదేవయ్య, పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు. పాలమంగళంలో మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దయాసాగర్, తిరుమలయ్య, మునిబాబు, శేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఈఆర్‌పీ ఉద్యోగుల నిరసన



నారాయణవనం, జనవరి 18: మండలంలోని ఎస్ఈఆర్‌పీ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ఉద్యోగులు గురువారం తమ డిమాండ్ల సాధన కోసం నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. తమను ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అన్ని కేడర్లకు చెందిన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా మండల సమాఖ్య ఉద్యోగులు నిలిచారు.

రేపు తలనీలాల వేలం

వడమాలపేట, జనవరి 18: సదాశివకోనలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాలు పోగుచేసుకునే హక్కుకోసం శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్టు బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ వేలం నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి ఉన్న వారు రూ.15 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే కామాక్షి దీపాల సేకరణకు రూ.10 వేలను, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు రూ.5వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

భూసమస్యలు పరిష్కరిస్తాం : డిప్యూటీ కలెక్టర్



రేణిగుంట, జనవరి18: జీపాళెంలో రైతులు ఎదుర్కొంటున్న సర్వే సమస్యలను రీసర్వేలో పరిష్కరిస్తామని కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ రైతులకు భరోసా ఇచ్చారు. గురువారం జీపాళెంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము ఎదుర్కొంటున్న సర్వే సమస్యలను ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీపాళెం పంచాయతీలో రీసర్వే ప్రారంభం కానుందని, ఆ సమయంలో రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కరి స్తామని హామీనిచ్చారు. తహసీల్దారు ఉదయ్‌సంతోష్, డీటీ దిలీప్‌కుమార్, సర్వేయర్ సురేష్‌బాబు, సర్పంచ్ బత్తెమ్మ, సచివాలయం సర్వేయర్ మనికంఠ పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

శ్రీకాళహస్తి, జనవరి 18: వెంకటగిరిలో శుక్రవారం జరిగే చంద్రబాబు సభను జయప్రదం చేయాలని పలువురు టీడీపీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిశీలకులు దొరస్వామి నాయుడు, నాయకులు కంటా రమేష్, కాసరం రమేష్ పాల్గొన్నారు. ● టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు, గాలి చలపతి నాయుడు, గురువారెడ్డి, దశరథాచారి సైతం పిలుపునిచ్చారు.

బుచ్చినాయుడుకండ్రిగ: 'రా కదిలిరా బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఆ పార్టీ మండల పరిశీలకులు దాముయాదవ్ పిలుపు నిచ్చారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్‌నాయుడు, నాయకులు వేదాం వెంకటచలం, శ్రీనివాసులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

వైసీపీని భూస్థాపితం చేద్దాం : టీడీపీ

శ్రీకాళహస్తి, జనవరి 18: రాష్ట్ర ప్రజలను దగా చేసిన వైసీపీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేద్దామని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, ఆమె కోడలు రిషితారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 29,30 వార్డుల్లో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ భూతాన్ని తరిమికొడదాం: జనసేన



ప్రచారం చేస్తున్న వినుత

శ్రీకాళహస్తి, జనవరి 18: ప్రజలను పీడిస్తున్న వైసీపీ భూతాన్ని తరిమికొట్టాలని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత పిలుపునిచ్చారు. పట్టణంలోని 9వ వార్డు పరిధిలో గురువారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఆర్టీసీ కూడలి వద్ద జనసేన నాయకులు వినుతకు క్రేన్‌తో పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షులు రవికుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు రాఘవయ్య, తొట్టంబేడు మండల అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఖ్వాజా గరీబ్ నవాజ్ ప్రత్యేక ప్రార్థనలు





అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, అజ్మీర్ దర్గా చిత్రపటం

రేణిగుంట, జనవరి18: రేణిగుంట బుగ్గవీధిలోని కరుమారియమ్మ ఆలయానికి ఎదుటవున్న ఖానఖా-ఏ-గరీబ్ నవాజ్‌లో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో ముస్లిం భక్తులు, మతగురువులు హజరత్ ఖ్వాజా గరీబ్‌నవాజ్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆజ్మీర్‌లో వున్న దర్గాలో 812వ వార్షిక ఉరుసు ఉత్సవాలను పురస్కరిచుకొని ఇక్కడి ఆశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు, గంధోత్సవం నిర్వహించారు. నగరంలో ఉన్న ముస్లింలతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి ముస్లిం మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి జనవరి 18: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ముం దుగా గురు దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



విశేష అలంకరణలో గురుదక్షిణామూర్తి

ముక్కంటి ఆలయ ఆదాయానికి గండి

● జీపీఎస్ అతిథి గృహంలోనే కాపురం పెట్టిన అధికారి



శ్రీకాళహస్తి, జనవరి 18:శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో పని చేస్తున్న కొందరు యధేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారు.కొందరైతే ఇంటి అద్దెను సైతం మిగలబెట్టుకునే కక్కుర్తి బుద్ధితో వ్యవహరిస్తున్నారు. ముక్కంటి సన్నిధిలో రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేయించుకునేందుకు విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు బస సౌకర్యం చాలా అవసరం. ముక్కంటి ఆలయం ద్వారా పరిమిత సంఖ్యలో భక్తుల కోసం గదులు అందుబాటులో ఉన్నాయి. ఆలయ ఆవరణలోపల వీఐపీల కోసం జ్ఞాన ప్రసూనాంబికా సదన్(జీపీఎస్) వుంది. సాధారణ భక్తుల కోసం ఉన్న త్రినేత్ర అతిథి గృహం లైబ్రరీగా మారిపోయాక జీపీఎస్ మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ గదులకు రూ.1700, ఆపై అంతస్తుల్లో రూ.1000 భక్తుల నుంచి వసూలు చేస్తుంటారు. ఈ అతిథి గృహంలో గదిని పొందేందుకు భక్తులు ఆసక్తి చూపుతుండడంతో డిమాండు బాగుంది. అంతటి విశేషమైన ఆ అతిథి గృహంలో ఓ అధికారి కాపురం పెట్టేశాడు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఓ కీలక అధికారి ఎనిమిది నెలల క్రితం ఈ ఆలయానికి బదిలీపై వచ్చారు. వాస్తవానికి ఆయనకు నెలకు రూ.15000 చొప్పున హౌస్ రెంట్ అలవెన్స్ జీతంతో పాటు పొందుతారు. అధికారి ఇంటి నుంచి విధులకు రాకపోకలు సాగించేందుకు డ్రైవర్‌తో సహా కారును కూడా ప్రభుత్వం కేటాయించింది. కానీ ఆయన మాత్రం ఆలయ ఆవరణలోని అతిథి గృహంలోనే మకాం పెట్టారు. దీంతో రోజుకు రూ.1000 చొప్పున ఆలయ ఆదాయానికి ఎంత గండిపడిందో అర్థం చేసుకోవచ్చు. రెండేళ్ల క్రితం శ్రీశైలానికి చెందిన పదిమంది ఉద్యోగులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలీపై వచ్చారు. వారిలో ఎనిమిదిమంది మూడు నెలల పాటు భక్తకన్నప్ప సదన్‌లో భక్తుల గదులను ఆవాసంగా మార్చుకున్నారు. ఆంధ్రజ్యోతిలో శివయ్యకు శఠగోపం శీర్షికన కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి అందరినీ ఖాళీ చేయించారు. 8ఏళ్ల క్రితం అతిథి గృహంలో గదిని ఓ ఉద్యోగి కొన్ని నెలల పాటు సొంతంగా ఉపయోగించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాక అప్పటి అధికారులు ముక్కు పిండి రోజులు లెక్క కట్టి మరీ బాడుగను వసూలు చేశారని సమాచారం. ప్రస్తుతం జీపీఎస్‌లో తిష్ట వేసిన అధికారి ఏకంగా పూర్తి వంట సామగ్రిని, గ్యాస్, ఎలక్ట్రిక్ పరికరాలు కూడా ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇంటి అద్దె, ఏసీ, కరెంటు అన్నీ ఉచితం కావడంతో దర్జాగా అనుభవిస్తున్నారు. ఇదే అతిథి గృహంలో మరో కీలక అధికారి కూడా భారీగా దుర్వినియోగం చేసినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల శ్రీకాళహస్తి నుంచి బదిలీ అయిన ఓ అధికారి రెండేళ్లపాటు ఇక్కడ ఇంచార్జి హోదాలో విధులు నిర్వహించారు. ఆయన ఏకంగా రెండేళ్లపాటు జీపీఎస్‌లో రెండు గదులు సొంతానికి ఉపయోగించుకున్నట్లు సమాచారం. శివయ్య సన్నిధిలో ప్రస్తుతం తిష్ట వేసిన అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

చంద్రబాబుతోనే సంపద సృష్టి : టీడీపీ



రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 18: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంపద సృష్టి సాధ్యమని ఆ పార్టీ నాయయకుడు డాక్టర్ రాజేష్ నాయుడు అన్నారు.. శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసిందన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయాలని కోరారు. అందుకోసం ఇప్పటి నుంచే చంద్రబాబుకు మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు నిలవాలని ఆయన కోరారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రజలంతా చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించు కోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ నెల 19న వెంకటగిరిలో చంద్రబాబు నిర్వహించే 'తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా 'బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో టీడీపీకి తిరిగి పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మూర్ఛతో మత్స్య కార్మికుడి మృతి

పిచ్చాటూరు, జనవరి 18: మండలంలోని పాత గొల్లకండ్రిగ మోరీసు చెల్లయ్య(55) మూర్ఛ వ్యాధిన పడి అనారోగ్యం పాలై మృతిచెందాడు. వారం రోజుల క్రితం అరణియార్ రిజర్వాయర్‌లో చేపల వేటలో ఉండగా మూర్ఛపోయాడు. సహచర మత్స్య కారులు గుర్తించి ఆయనను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అపస్మారక స్థితికి వెళ్లిపోయిన ఆయన్ను ఇంటికి తరలించారు. స్థానికంగా చికిత్స తీసుకున్నాడు. అయితే తరచూ మూర్ఛకు గురై మంచానికే పరిమితమైన ఆయన గురువారం తుదిశ్వాస వదిలాడు. మృతుడి కుటుంబాన్ని మత్స్యశాఖ ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు, మత్స్యకారులు కోరుతున్నారు.

ప్రణాళికతోనే అభివృద్ధి సాధ్యం

వరదయ్యపాళెం, జనవరి 18: గ్రామపంచాయతీలో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు పేర్కొన్నారు. వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2024-25కు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు వస్తున్న నిధులు, పంచాయతీల ఆదాయం కలిపి చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఈవోపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జీపీడీపీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్యవేడు ఎస్ఐగా వీరాంజనేయులు

సత్యవేడు, జనవరి 18: సత్యవేడు ఎస్ఐగా వీరాంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లారు. దీంతో కర్నూలు జిల్లా బనగానపల్లెలో విధులు నిర్వహిస్తున్న వీరాంజనేయులును సత్యవేడుకు బదిలీ చేశారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

రేణిగుంట, జనవరి18: రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి -రేణిగుంట రైలుమార్గంలోని వెదుళ్లచెరువు గ్రామం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. మృతుడి జేబులో ఉన్న లేఖలో రాజా అనే పేరు ఉంది. ఇతర వివరాలు లేవు. మృతదేహన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎస్మా' దుర్మార్గం



అంగన్వాడీల సమ్మెలో పాల్గొన్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి జనవరి 18: చిరు ఉద్యోగులైన అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గపు చర్యని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద అంగన్వాడీలు గురువారం తమ నిరవధిక సమ్మెను రిలే దీక్షతో కొనసాగించారు. ఇందులో భాగంగా బీజేపీ వారికి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇదే నిరంకుశ వైఖరి కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు వివరణలు సమర్పిస్తూ నిరసన తెలియజేశారు.

రేణిగుంట: రేణిగుంటలో ఐసీడీఎస్ అధికారిణి కృష్ణ మంజరి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు వివరణ ఇస్తూ వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సత్యవేడు: సత్యవేడులో ప్రభుత్వం జారీ చేసిన షోకాజు నోటీసులకు అంగన్వాడీ కార్యకర్తలు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. సూపర్‌వైజర్‌లు చెంచులక్ష్మి, జ్యోతికి తమ వివరణ అందించారు.

క్రికెట్ మండల విజేత టీపీకోట

నాగలాపురం, జనవరి 18: ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలలో టీపీకోట సచివాలయం జట్టు మండల విజేతగా నిలిచినట్లు ఎంపీడీవో కుల్లాయి బాబు తెలిపారు. నాగలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని గ్రౌండ్‌లో గురువారం జరిగిన ఫైనల్స్‌లో బీరకుప్పం జట్టుపై టీపీ కోట గెలుపొందింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీపీకోట టీం నిర్ణీత పది ఓవర్లలో 89 పరుగులు చేయగా బీరకుప్పం 73 పరుగులు మాత్రమే సాధించింది.

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం

తొట్టంబేడు, జనవరి 18: క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదామని టాటా ట్రస్టు శ్రీవెంకటేశ్వర క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకయ్యబాబు అన్నారు. మండలంలోని కాసరం గ్రామ సచివాలయంలో గురువారం రాస్, టాటా ట్రస్టు సంయుక్తంగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాస్, టాటా ట్రస్టు సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనం



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 18: మండలంలో అన్ని గ్రామాలలో గురువారం గౌరమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి నెల రోజులు పాటు మహిళలు రోజూ సాయంత్రం గ్రామాలలో గౌరమ్మకు గొబ్బెళ్లు తట్టారు. చివరి రోజు బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గౌరమ్మను గ్రామంలో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అన్నదానం చేశారు.

ఘనంగా ఎన్టీయార్ వర్ధంతి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు

సత్యవేడు, జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతిని సత్యవేడులో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరమశివం, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం, గణేష్, సంపత్ కుమార్, దావుద్, చంద్రమోహన్, మధుయాదవ్, నాగరాజు పాల్గొన్నారు. ● స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్, తెలుగు యువత నాయకులు తులసీ, సంతోష్‌కుమార్ తదితరులు ఎన్‌టీఆర్‌కు అంజలి ఘటించారు. ● పట్టణంలో ఎన్టీఆర్ నగర్‌లో మాజీ ఎంపీపీ రాధయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు, శివయ్య శెట్టి, బాబుయాదవ్, పళణి, హేమభూషణం, కోనయ్య, యుగంధర్, రహీం, తదితరులు పాల్గొన్నారు.







శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుల నివాళులు, వరదయ్యపాళెంలో అన్నదానం చేస్తున్న నాయకులు

ఎన్టీయార్ ఆశయాలు కొనసాగిస్తాం

శ్రీకాళహస్తి, జనవరి 18: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు యుగ పురుషుడని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని గురువారం టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ కూడలిని పూల అలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం ఎన్టీఆర్‌కు పాలాభిషేకం చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గురువారెడ్డి, పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ పాల్గొన్నారు.

రేణిగుంట: ఎన్టీయార్ ఆశయాలను కొనసాగిస్తామని టీడీపీ రేణిగుంట మండల నాయకులు తెలియజేశారు. రేణిగుంటలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పార్టీ మండల అధ్యక్షుడు టి.మునిచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు పి.మునస్వామినాయుడు మాట్లాడారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.పుష్పనాథ్, సి.సుబ్ర మణ్యంరెడ్డి, పి.చిన్నారెడ్డి, రామస్వామి, మహ బూబ్‌బాష, సీటీ సుబ్రమణ్యం, వెంకటేష్ చౌదరి, నవాబ్‌జాన్, బుజ్జినాయుడు, సుబ్బరాయాచారి, నాగేశ్వర్‌రావు, మునెయ్య, ఈ.మురళి, వెంకట మునిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. ● గుత్తివారిపల్లిలో టీడీపీ సీనియర్ నాయకులు పి.మునస్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టీ ఆర్‌కు నివాళులర్పించారు. ● వెదుళ్ల చెరువులో టీడీపీ లీగల్ సెల్ నాయకుడు ఉదయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని గోవిందవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు పేరం చింజీవులునాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ● రావిళ్లవారి కండ్రిగలో పేదలకు అన్నదానం చేశారు. ● అంజిమేడులో ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, గుడిమల్లంలో గిరినాయుడు ఆధ్వర్యంలో ఎన్టీ ఆర్‌కు నివాళులు అర్పించారు.

వరదయ్యపాళెం: టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, నాగరాజు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్‌కు అంజలి ఘటించారు. పేదలకు అన్నదానం చేశారు. నాయకులు జయచంద్రనాయుడు, మధునాయుడు, దశరథయ్య, విష్ణు, హరిప్రసాద్ నాయుడు, సుదర్శన్ రెడ్డి ఎస్ఆర్ఐ నందకిషోర్, జనసేన జిల్లా కార్యదర్శి తడ శ్రీను, మురళి, చిరంజీవి, తులసి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. నాయకులు సుందరయ్య, వేదాం వెంకటా చలం, శ్రీనివాసులు, రమేష్‌బాబు, భాస్కర్ యాదవ్, రమణయ్య యాదవ్, ఉషా రాణి, రవియాదవ్, అశోక్‌నాయుడు, బాబు, శేఖర్ పాల్గొన్నారు.

కేవీబీపురం: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు రామాంజుల నాయుడు, గోపినాథ్‌రెడ్డి, మునిస్వామి యాదవ్, లక్ష్మీపతి రాజు, బాలాజీ, సురేష్‌రెడ్డి, కందస్వామి, జయకుమార్, మణి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో అన్నదానాలు చేశారు.







బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగ, కేవీబీపురంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు